జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO: APTEL/26/A7657

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 17 ॥ గురువారం ॥ 1-10-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

01 అక్టోబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:01 తిథి పంచమి మ. 12:35 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం రోహిణి తె. 4:25o వరకు తరువాత మృగశిర యోగం సిద్ధి రా. 9:13 వరకు కరణం తైతుల మ. 12:35 వరకు గరజి రా. 11:25 వరకు వర్జ్యం రా. 8:58 నుండి రా. 10:28 వరకు దుర్ముహూర్తం ఉ. 10:07 నుండి ఉ. 10:54 వరకు మ. 2:51 నుండి మ. 3:39 వరకు రాహుకాలం మ. 1:34 నుండి మ. 3:03 వరకు యమగండం ఉ. 6:09 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు రా. 1:27 నుండి రా. 2:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:29 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

థ్యాంక్యూ సీఎం సార్






పట్టాల పండుగ


భూములకు హక్కులు కల్పిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ

పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి.. ప్రజల ముఖాల్లో నవ్వులు చూస్తున్నా:బాబు

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటుకూ న్యాయం చేస్తుందన్నారు. ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడుతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ.. ముందుకు వెళ్తోందని వ్యాఖ్యానించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం... దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ చేశారు.



ఎన్టీఆర్ జిల్లాలో 26,401 పేద కుటుంబాలకు ఇంటి స్థలాలపై హక్కులు కల్పించినట్లు చంద్రబాబు ప్రకటించారు. 707 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తున్నామని, వీటి విలువ రూ.28,112 కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తోందని తెలిపారు. విశాఖపట్నం, మంగళగిరి తదితర ప్రాంతాల్లో కలిపి ఇప్పటివరకు సుమారు 60 వేల మంది పేదలకు పట్టాలు అందించినట్లు సీఎం వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెబుతూ.. లబ్ధిదారులు తమకు అందిన పట్టాలను భవిష్యత్ ఆస్తిగా భద్రపరుచుకోవాలని తరువాయి 2 వ పేజీలో..



అన్నదాతకు భరోసా..

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

అన్నదాతకు మద్దతు.. దేశానికి గ్రీన్ బాట

ఎంఎస్‌పీ పెంపుతో రైతులకు ఊరట

ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్‌కు ఆమోదం

రైతన్నల కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓ వైపు ఎల్‌నినో.. ఇంకోవైపు తీవ్ర వర్షాభవ కారణంగా అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణం లో నరేంద్రమోదీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 2027-28 మార్కె టింగ్ సీజన్‌కు సంబంధించి ఆరు రబీ పంటల కనీస మద్దతు ధరలను పెంచు తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. కుసుమ పంటకు క్వింటాల్‌కు అత్యధి కంగా రూ.675 పెంపు లభించగా, ఆవాలు-- రాప్‌సీడ్‌కు రూ.413, మసూర్ పప్పుకు
తరువాయి 2 వ పేజీలో..



7

రాజకీయాల్లోకి వస్తున్నా..

మాజీ ఐపీఎస్ దివ్యా మిట్టల్ ఎంట్రీ

యూపీ ఎన్నికల వేళ అరంగేట్రం



ఈసీపై పోరుబాట..

ఇండియా కూటమి ఉద్యమ బాట.. ఈసీపై పోరుకు కార్యాచరణ

అక్టోబర్ 2 నుంచి సేవ్ డెమొక్రసీ మార్చ్.. SIRపై పోరు

ఓటరు జాబితాలపై దర్యాప్తు డిమాండ్.. ఢిల్లీలో భారీ ర్యాలీ

ఎన్నికల సంఘం పనితీరు, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై వివాదం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి మరోసారి ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైంది. బుధవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో కూటమి నేతలు ఉమ్మడి కార్యాచరణపై చర్చించారు.

ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టే నోటీసు ముసాయిదాపైనా చర్చ జరిగినట్లు సమాచారం. SIR ప్రక్రియను నిలిపివేయాలని, ఓటరు జాబితాల నుంచి పేర్ల తొలగింపుపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కూటమి తదుపరి తరువాయి 2 వ పేజీలో..



7

అబ్బనీ తీయనీ దెబ్బ..

విజయసాయి రెడ్డి పొలిటికల్ గేమ్ స్టార్ట్

కొత్త పార్టీ దిశగా వేగంగా పావులు

జగన్‌పై సంచలన ఆరోపణలు

మూడో ప్రత్యామ్నాయానికి పిలుపు



దసరా మహోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఇంద్రకీలాద్రిపై ఉత్సవాలు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

అమరావతి, సెప్టెంబర్ 30: రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి కృప రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందించారు. ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో..

కియా తయారీ కేంద్రాన్ని సందర్శించిన నారా లోకేష్

పారిశ్రామిక విస్తరణ అవకాశాలపై చర్చ

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఆహ్వానం

తయారీ సామర్థ్యాలను పరిశీలించిన మంత్రి



కొచ్చి, సెప్టెంబర్ 30: ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కొచ్చిలోని ప్రముఖ వస్త్ర తయారీ సంస్థ కిటెక్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఇటీవల సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశానికి కొనసాగింపుగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. సంస్థ ఉత్పత్తి ప్రక్రియలు, తయారీ సామర్థ్యాలు, నాణ్యత ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సంస్థలో అమలవుతున్న సమగ్ర తయారీ విధానాలు, ఆధునిక ఉత్పత్తి సాంకేతికతలను తరువాయి 2 వ పేజీలో..

జనసేన

జనసేనలో కొత్త కమిటీలు

స్థానిక సమరానికి జనసేన సరికొత్త వ్యూహం

పాత కమిటీలకు పవన్ గుడ్‌బై

నేటి రాశి ఫలాలు

మేషం: వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో చిన్నపాటి వివాదాలుంటాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

వృషభం: వ్యాపారాలు విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విశేషాలు తెలుస్తాయి. ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందుతారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మిథునం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఆర్థికాభివృద్ధి కలుగుతుంది. బందుమిత్రులతో సక్యతగా వ్యవహరిస్తారు.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూరప్రయాణాలు వాయిదా పడుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దైవచింతన కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహ పరుస్తుంది. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

సింహం: వ్యాపారాలలో స్వల్ప ఇబ్బందులుంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. సన్నిహితులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

తుల: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. పాత మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఆకస్మిక మార్పులుంటాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఋణయత్నాలు వేగవంతం చేస్తారు.

వృశ్చికం: చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

ధనస్సు: వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేయాల్సి వస్తుంది. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి.

మకరం: నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో పురోగతి కలుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఋణగ్రస్తుల నుండి రావలసిన సొమ్ము వసూలవుతుంది.

కుంభం: చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.


మీనం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు. నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి.



పట్టాల పండుగ

మొదటి పేజీ తరువాయి

సూచించారు. భూహక్కుల అంశంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులపైనా చంద్రబాబు పలు ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో భూ వ్యవహారాల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రీసర్వే చేపట్టి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తోందని తెలిపారు. పట్టిసీమ ద్వారా నీటిని అందించి డెల్టా ప్రాంతంలో సాగునీటి అవసరాలను తీర్చామని, పోలవరం పనులను పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీటిని అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. గోదావరి నీటిని వినియోగంలోకి తీసుకురావడం, కృష్ణా--గోదావరి అనుసంధానం, రాబోయే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేయడం వంటి లక్ష్యాలను కూడా సీఎం ప్రస్తావించారు. ఇవన్నీ ప్రభుత్వ ప్రణాళికలు, ప్రకటనలుగా ఉండగా.. వాటి పూర్తి ఫలితాలు ప్రాజెక్టుల అమలు, గడువులు, నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయి. మహిళల ఆర్థిక భాగస్వామ్యం, సంక్షేమ కార్యక్రమాలపైనా సీఎం తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేంద్ర గణాంకాల ఆధారంగా విశాఖపట్నం, విజయవాడల్లో మహిళల వర్క్‌ఫోర్స్ భాగస్వామ్యాన్ని ప్రస్తావిస్తూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నామని, పీ4 కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, వచ్చే ఏడాదిలో మరో 5.5 లక్షల ఇళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం ప్రకటించారు. సంక్షేమంతో పాటు ఆదాయ మార్గాలు, ఉపాధి అవకాశాలు పెంచడంపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అభివృద్ధిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమరావతిని ఆధునిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని, గ్రీన్ ఎనర్జీ, కనెక్టివిటీ, రోడ్డు--రైలు మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, విశాఖ నగరాలకు అంతర్జాతీయ స్థాయి నగరాల సూచికల్లో చోటు దక్కిందని సీఎం ప్రస్తావించారు. పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లతో, గ్రామీణ ప్రాంతాల్లో రూ.11 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం, అమరావతి కనెక్టివిటీ, బ్యారేజీల నిర్మాణం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు. అయితే ఈ ప్రాజెక్టుల ప్రభావాన్ని అంచనా వేయాలంటే పెట్టుబడులు, నిర్మాణ పురోగతి, ఉపాధి కల్పన, ప్రజలకు అందే మౌలిక వసతుల వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. మరోవైపు ప్రతిపక్షంపై సీఎం చంద్రబాబు చేసిన విమర్శలు సభలో రాజకీయ వేడిని పెంచాయి. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షం అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించగా, అమరావతి నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, భూ పట్టాల పంపిణీ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.



పేదల పట్టాభిషేకం.. విజయవాడకు పండుగరోజు: కేశినేని చిన్ని

50 ఏళ్ల సమస్యకు పరిష్కారం.. పేదల ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్

25 వేల మందికి లబ్ధి.. ప్రభుత్వానికి ఎంపీ కేశినేని చిన్ని కృతజ్ఞతలు

విజయవాడలో పేదల ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్, కన్వీయన్స్ డీడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని చిన్ని పేదల పట్టాభిషేకంగా అభివర్ణించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవాడ ప్రజలకు పండుగరోజు లాంటిదని అన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పేదల ఇళ్ల పట్టాల సమస్యను ఎమ్మెల్యేలంతా కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని, రెగ్యులరైజేషన్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయని తెలిపారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ కార్యక్రమం సాధ్యమైందన్నారు.

విజయవాడలో పేదల సంక్షేమం, మౌలిక వసతులు, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను కేశినేని చిన్ని ప్రస్తావించారు. వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలోనే ఉండి బాధితులకు అండగా నిలిచారని, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి భరోసా కల్పించే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారం కూడా ఉందన్నారు. అమరావతిలో కీలక భాగమైన విజయవాడను మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. రానున్న దసరా, విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా వంటి కార్యక్రమాలతో నగరంలో సందడి నెలకొననుందని, రాష్ట్రపతితో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు విజయవాడకు రానున్న నేపథ్యంలో నగర ప్రజలు ఆతిథ్యాన్ని చాటాలని కేశినేని చిన్ని పిలుపునిచ్చారు.

కిటెక్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన నారా లోకేష్

మొదటి పేజీ తరువాయి

లోకేష్ పరిశీలించారు. ఉత్పత్తుల నాణ్యత, సామర్థ్యం, నిర్వహణ విధానాలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

ఈ సందర్భంగా కిటెక్స్ యాజమాన్యంతో సమావేశమైన మంత్రి, ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. రాష్ట్రంలో కొత్త తయారీ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, తయారీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని లోకేష్ తెలిపారు. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామిక పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

కిటెక్స్ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. వస్త్ర తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. పరిశ్రమల విస్తరణ ద్వారా ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. పర్యటన సందర్భంగా కిటెక్స్ ప్రతినిధులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో తయారీ విస్తరణ అవకాశాలను పరిశీలించేందుకు సంస్థ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు.



దసరా మహోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఆలయ సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్శనం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, భద్రత తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలని, సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అన్నదాతకు భరోసా..

మొదటి పేజీ తరువాయి

రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున పెంపు లభించింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రం తెలిపింది. ఇక దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రీన్ ఎనర్జీ కారిడార్--3 పథకానికి కూడా కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.1.86 లక్షల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టు ద్వారా 135 గిగావాట్ల వరకు పునరుత్పాదక విద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయనున్నారు. అలాగే 50 గిగావాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏఐ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్స్, రియల్‌టైమ్ ట్రాఫిక్ సమాచారం, ఆటోమేటెడ్ నిఘా వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి. అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ కల్పించడంతో పాటు ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలను వెంటనే గుర్తించే సదుపాయం ఏర్పడనుంది. అలాగే రాంగ్‌రూట్, స్పీడింగ్, రెడ్‌లైట్ జంపింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించనున్నారు. మొత్తంగా చూస్తే కేంద్ర కేబినెట్ నిర్ణయాలు మూడు ప్రధాన దిశలను స్పష్టంగా చూపిస్తున్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు, దేశానికి గ్రీన్ ఎనర్జీ భవిష్యత్, నగరాలకు స్మార్ట్ టెక్నాలజీ ఆధారిత మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా కనిపిస్తోంది. వ్యవసాయం నుంచి ఇంధనం, ట్రాఫిక్ నిర్వహణ వరకు విభిన్న రంగాల్లో తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవన విధానంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈసీపై పోరుబాట..

మొదటి పేజీ తరువాయి

కార్యాచరణను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, కలెక్టరేట్‌ల వద్ద సేవ్ డెమొక్రసీ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలంతా కలిసి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలు రాష్ట్రపతిని కలిసి ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ సంస్థలపై తమ అభ్యంతరాలను వివరించేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఐదు భారీ సభలు నిర్వహించడంతో పాటు నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ చేపట్టాలని కూటమి నిర్ణయించింది ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల వ్యవస్థలో అవకతవకలు జరుగుతున్నాయని, ఓటరు జాబితాల్లో మార్పులపై పారదర్శకత అవసరమని ఖర్గే, రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఇక ఇండియా కూటమి అంతర్గత సమన్వయం కూడా ఈ సమావేశంలో చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి పలు ప్రతిపక్ష పార్టీలు హాజరుకాగా, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే దూరంగా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్థానంలో ఆ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే తీర్మానం పార్లమెంట్‌లో వస్తే మద్దతు ఇస్తామని డీఎంకే ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ వెల్లడించారు. మొత్తంగా చూస్తే.. ఎన్నికల సంఘం, ా×=, ఓటరు జాబితాల అంశాలను కేంద్రంగా చేసుకుని ప్రతిపక్షాలు పార్లమెంట్‌తో పాటు ప్రజాక్షేత్రంలోనూ ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణను రూపొందించుకున్నాయి.

శ్వేత

సంపాదకీయం

గురువారం 1-10-2026

ఒక్కడే... అందరికీ టార్గెట్...?

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక ఆసక్తికరమైన దృశ్యం కనిపిస్తోంది. అధికారంలో కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ప్రతిపక్షంలో బీఆర్ఎస్, బీజేపీ. సిద్ధాంతాలు, రాజకీయ లక్ష్యాలు వేర్వేరైనా, విమర్శల బాణాలు మాత్రం తరచూ ఒకే దిశగా దూసుకెళ్తున్నాయి. రేవంత్‌రెడ్డే లక్ష్యంగా కాషాయ, గులాబీ శిబిరాల నుంచి వరుస దాడులు. అధికారంలో ఉన్న నాయకుడిని ప్రతిపక్షాలు ప్రశ్నించడం సహజమే. కానీ ఒక వ్యక్తిపై, ఒక పార్టీపై అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరిగినప్పుడు, అది కేవలం రాజకీయ విమర్శల పోటీగానే కాకుండా తెలంగాణలో ఆధిపత్యం కోసం సాగుతున్న పెద్ద పోరాటంగా కనిపిస్తుంది.. బీఆర్ఎస్‌కు రేవంత్‌రెడ్డి ప్రత్యర్థిత్వం కొత్తది కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే కాదు, రేవంత్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ అప్పటి అధికార బీఆర్ఎస్‌కు ఆయన రాజకీయంగా లక్ష్యంగానే ఉన్నారు. వ్యక్తిగతంగానూ, పార్టీ పరంగానూ ఆయనపై తీవ్ర రాజకీయ, న్యాయపరమైన వివాదాలు కొనసాగాయి. 2015, 2018ల్లో నమోదైన కేసులు, అరెస్టులు, జైలు పరిణామాలు ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక మలుపులుగా నిలిచాయి. వాటి వెనుక ఉద్దేశాలు, కేసుల చట్టపరమైన పరిణామాలపై రాజకీయ వాదనలు వేర్వేరుగా ఉన్నా, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో రేవంత్ ఎదుర్కొన్న తీవ్రమైన ఒత్తిడి మాత్రం రాజకీయ చరిత్రలో నమోదైన వాస్తవం. 2023లో బీఆర్ఎస్ పాలనకు తెరపడటంలో కాంగ్రెస్ విజయం, అందులో రేవంత్ నాయకత్వం కీలకమైంది. సహజంగానే బీఆర్ఎస్ పునరాగమనానికి కాంగ్రెస్ ప్రధాన రాజకీయ అడ్డంకిగా మారింది. అందుకే కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు ప్రభుత్వ హామీలు, సంక్షేమం, శాంతిభద్రతలు, అభివృద్ధి, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై నిరంతరం విమర్శలు చేస్తున్నారు. మరోవైపు కాళేశ్వరం, ధరణి, ఫోన్ ట్యాపింగ్ తదితర అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలనను ప్రశ్నిస్తోంది. అయితే ఆరోపణ వేరు, దర్యాప్తులో తేలే వాస్తవం వేరు, న్యాయస్థానంలో నిరూపణ వేరు. రాజకీయ వేదికపై తీర్పులు ఇవ్వకుండా సంస్థాగత విచారణలకు అవకాశం ఇవ్వడమే ప్రజాస్వామ్య పద్ధతి.

బీజేపీది మరో రాజకీయ లెక్క. తెలంగాణలో మూడో రాజకీయ శక్తిగా ఎదగాలంటే అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కూడా దానికి ప్రత్యర్థే. అందుకే ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు సహజం. అయితే రెండు ప్రతిపక్ష పార్టీలు ఒకే వ్యక్తిని విమర్శిస్తున్నాయన్న కారణంతో వాటి మధ్య అవగాహన ఉందని తేల్చడం ఎంత తొందరో, ప్రతి విమర్శ వెనుక కుట్ర ఉందని భావించడం కూడా అంతే ప్రమాదకరం. రాజకీయ సమీకరణాలు శాశ్వతం కావు. ప్రయోజనాలే వాటిని మార్చుతుంటాయి. ఈ ముప్పేట ఒత్తిడికి తోడు రేవంత్‌కు మరో పరీక్ష ఉంది, సొంత పార్టీని సమన్వయం చేసుకోవడం. ఢిల్లీ అధిష్ఠానంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, రాష్ట్రంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులను కలుపుకొని వెళ్లడం, అసంతృప్తులను బుజ్జగించడం, భిన్న వర్గాల మధ్య సమన్వయం సాధించడం, ఇవన్నీ ముఖ్యమంత్రి రాజకీయ నిర్వహణలో కీలక అంశాలు. బయట ప్రతిపక్షాలను ఎదుర్కొంటూనే లోపల పార్టీని ఐక్యంగా ఉంచడం కత్తిమీద సామే. అయితే రాజకీయ దూకుడు ఎంత ఉన్నా, చివరి కొలమానం పాలనా ఫలితాలే. ఉద్యోగాలు, రైతుల సమస్యలు, పెట్టుబడులు, నగర మౌలిక వసతులు, సంక్షేమ హామీలు, ఆర్థిక క్రమశిక్షణ, శాంతిభద్రతలు, ప్రతి రంగంలో ప్రజలకు కనిపించే మార్పు రావాలి. అదే ప్రభుత్వానికి నిజమైన రక్షణ.

మరోవైపు 2028 ఎన్నికలకు ఇంకా దాదాపు రెండేళ్లు ఉండగానే కాంగ్రెస్ మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి రాజకీయ, సంస్థాగత సన్నద్ధతను ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, అసంతృప్తులను సమన్వయం చేయడం, హామీల అమలులో స్పష్టమైన ఫలితాలు చూపడం, ఇవే రాబోయే కాలంలో కీలకం. కాబట్టి రేవంత్‌రెడ్డి ఇప్పుడు కేవలం ప్రతిపక్షాల విమర్శలను ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి మాత్రమే కాదు, అన్ని వైపుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్ల మధ్య ప్రభుత్వాన్ని నడపాల్సిన నాయకుడు. ఆయనకు ప్రతిపక్షాల దాడి ఒక పరీక్ష. కాంగ్రెస్‌కు అంతర్గత ఐక్యత, పాలనా ఫలితాలు మరో పరీక్ష. బీఆర్ఎస్‌కు గత పాలనపై ప్రజల తీర్పును ఎదుర్కొని పునరాగమన మార్గం వెతకడం పరీక్ష. బీజేపీకి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తన స్థానం బలోపేతం చేసుకోవడం పరీక్ష. చివరికి ఎవరు ఎవరిని ఎంత గట్టిగా విమర్శించారన్నది కాదు, ఎవరు ప్రజల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొచ్చారన్నదే ఎన్నికల గడప దాటే అసలు ప్రశ్న. కాషాయం కావచ్చు, గులాబీ కావచ్చు, కాంగ్రెస్ కావచ్చు, నాయకులు మారుతారు, సమీకరణాలు మారతాయి, కానీ ప్రజల తీర్పు మాత్రం ఒక్కటే, పాలన ఎలా ఉంది, భవిష్యత్తు ఎలా ఉంటుంది?



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కీలక సమావేశం.. ఓటర్ల నమోదు, ఎన్నికల సన్నద్ధతపై విస్తృత చర్చ...

ఉప్పల్, సెప్టెంబర్ 30: మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గంలో కీలక సమావేశం నిర్వహించారు. బుధవారం డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గొల్లూరి అంజయ్యతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై నాయకులు, కార్యకర్తలు, బాధ్యులతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు కూలంకషంగా చర్చించారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడం, ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టడం, అలాగే రాబోయే ఎన్నికల సన్నద్ధత తదితర కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా పునఃసిద్ధం చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో, అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఫారమ్-18 (ఫారం-18) ద్వారా తమ పేర్లను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ 4వ డివిజన్ (జిహెచ్ఎంసి) మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య గారు మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రతి స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి పేరు కూడా ఓటరు జాబితాలో నమోదు కాకుండా మిగిలి పోకూడదని, నాయకులు మరియు కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో ముగ్గురు అధికారుల ఉద్యోగ విరమణ

మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 30: మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో సేవలందించిన ముగ్గురు పోలీస్ అధికారులు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్ అవుతున్న అధికారులు తమ సుదీర్ఘ పోలీస్ సేవలో ఎదురైన అనుభవాలను, విధి నిర్వహణలో ఎదురైన సవాళ్లను, వాటిని అధిగమించిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. తమ సేవా ప్రయాణంలో ఎదురైన అనుభవాలను తోటి అధికారులు, సిబ్బందితో పంచుకున్నారు. పోలీస్ కమిషనర్ బి.సుమతి గారు మాట్లాడుతూ, పోలీస్ విధుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పరిస్థితుల నుంచి నేర్చుకుంటూ, అనుభవాన్ని భవిష్యత్ సేవలకు ఉపయోగించుకోవాలని విలువైన సూచనలు చేశారు.

రిటైర్మెంట్ పొందుతున్న అధికారులు పోలీస్ శాఖకు అందించిన సేవలను అభినందిస్తూ, వారి విధి నిర్వహణను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో అడిషనల్ డిసిపి (క్రైమ్స్) శ్రీ సిహెచ్.రామేశ్వర్, ఆర్.ఎస్.ఐ శ్రీ ఏ.కృష్ణారెడ్డి, నాచారం ఎస్సై శ్రీ పి. ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో డిసిపి (అడ్మిన్) ఇందిర గారు మరియు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని రిటైర్ అవుతున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

మల్కాజ్‌గిరి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరఫున ప్రెసిడెంట్ డి. శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు వెంకటేశ్వర్లు, రంగస్వామి, జాయింట్ సెక్రటరీ ఎస్. వలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేష్, ఈసీ మెంబర్లు గోపి, రాజేష్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏ ఆర్ ప్రెసిడెంట్ డి.సతీష్, ట్రెజరర్ విజయ్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి. మోహన్ లాల్, కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరఫున డైరెక్టర్లు సువర్ణ, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసనను జయప్రదం చేద్దాం

టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి



ఉప్పల్, సెప్టెంబర్ 30 : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న గాంధీ విగ్రహాల వద్ద నిర్వహించ తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈసీఐఎల్ చౌరస్తా సమీపంలోని కాప్రా మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసే కార్యక్రమంలో ఉప్పల్, మల్కాజ్గిరి, మేడ్చల్ నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల, మీడియా సంస్థల సమస్యలు ఎంతో కాలంగా అపరిష్కారంగా ఉన్నాయని, గత నాలుగు దశాబ్దాల కాలంగా మీడియా రంగంలో చోటు చేసుకున్న విప్లవాత్మకమైన మార్పులకు తోడు, జర్నలిజం నైతిక విలువలకు సంబంధించిన పలు సూచనలు, సిఫార్సులను చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ మీదకి ఈ నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వేతన బోర్డు, జర్నలిస్టుల రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలన్న తదితర డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రజా పాలన మొదలై మూడేళ్లు గడుస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరమన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. గతంలో ఉన్న హెల్త్ స్కీం లను పునరుద్ధరించాలని టీయూడబ్ల్యూజే మొదటి నుంచి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య భద్రత కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనకే పరిమితమైనయని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం జర్నలిస్టులు ఆందోళన బాట పట్టక తప్పని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. అదేవిధంగా ఇల్లు, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు.















విజయవాడలోని సింగ్ నగర్‌లో మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. లబ్ధిదారు మహిళలకు వేదికపై పట్టాలు అందించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెంబ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ శివనాథ్, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.



గగనతలంలో పైలట్ల ఘర్షణ కలకలం

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఓ ప్రయాణికుల విమానంలో చోటుచేసుకున్న అనూహ్య ఘటన అంతర్జాతీయ స్థాయిలో కలకలం రేపింది. ఫ్లై దుబాయ్‌కు చెందిన ఎఫ్‌జెడ్ 1073 విమానం ప్రయాణ మధ్యలో అత్యవసర సంకేతాలు పంపడంతో పాటు అకస్మాత్తుగా ఎత్తు తగ్గించడంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. మొదట సాధారణ అత్యవసర పరిస్థితిని సూచించే సంకేతం పంపిన విమానం, అనంతరం అక్రమ జోక్యం లేదా హైజాక్ అనుమానాన్ని సూచించే మరో సంకేతాన్ని కూడా పంపింది. దీంతో పరిస్థితిపై తీవ్ర ఆందోళన నెలకొంది. బోయింగ్ 737 మ్యాక్స్ 8 రకానికి చెందిన ఈ విమానం దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియన్ విమానాశ్రయానికి వెళ్తోంది. విమానం సుమారు 34 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీగా ఎత్తు తగ్గించినట్లు విమాన గమనికల వివరాలు సూచించాయి. ఈ పరిణామంతో విమానంలో సాంకేతిక లోపమా, భద్రతా ముప్పా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. విమానం నుంచి హైజాక్ హెచ్చరిక సంకేతం అందడంతో ఇజ్రాయెల్ భద్రతా వ్యవస్థ వెంటనే స్పందించింది.

గేమింగ్ రంగానికి హైదరాబాద్ ప్రపంచ వేదిక

హైదరాబాద్, సెప్టెంబర్ 30

గేమింగ్, దృశ్య ప్రభావాలు, యానిమేషన్ రంగాల్లో హైదరాబాద్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ రంగాల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత యానిమేషన్, గేమింగ్, దృశ్య ప్రభావాలు, సృజనాత్మక వినోద రంగాలకు చెందిన సంస్థలను హైదరాబాద్‌కు ఆకర్షించి వారి కార్యకలాపాల విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు సాంకేతిక రంగ అభివృద్ధికి ఈ చర్యలు దోహదపడతాయని అన్నారు. "కథలు, ఆటలు, కలలు" అనే ప్రధాన భావనతో యువతను ఆకర్షించే పలు కార్యక్రమాలను సమ్మిట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక వ్యాపార దినోత్సవాన్ని నిర్వహించి పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపై సమావేశమయ్యే అవకాశం కల్పించనున్నారు. సృజనాత్మక పరిశ్రమల భవిష్యత్తు, పెట్టుబడి అవకాశాలు, సాంకేతిక పరిణామాలపై చర్చలు జరగనున్నాయి. అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు, సాంకేతిక ఆవిష్కరణల వేదికలు, సృజనాత్మక రంగాల ప్రదర్శన శాలలు కూడా సమ్మిట్‌లో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వినోద, సాంకేతిక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను పరిచయం చేసే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన భాగస్వామ్యాల ఏర్పాటుకు కూడా ఈ సమ్మిట్ ఉపయోగపడనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సుమారు 50 పెద్ద, 150 మధ్య తరహా యానిమేషన్, గేమింగ్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని సంజయ్ జాజు వెల్లడించారు. మరిన్ని అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించడం ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సృజనాత్మక పరిశ్రమల విస్తరణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారుతుందని అన్నారు. సమ్మిట్‌లో భాగంగా నగరంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించనున్నారు. సుమారు 70 కళాశాలల విద్యార్థులతో పాటు 50 వేల మందికి పైగా సందర్శకులు కార్యక్ర మాలను వీక్షించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. యువతలో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందిస్తూ హైదరాబాద్‌ను ప్రపంచ సృజనాత్మక, వినోద రంగాల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.





ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తపన చౌదరి

ఏలూరు ఎస్పీడీబీటీ కళాశాల విద్యార్థులకు లక్ష రూపాయలు విలువైన పాఠ్యపుస్తకాల పంపిణీ

ఏలూరు, సెప్టెంబర్ 30: విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరులోని ఎస్పీడీబీటీ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు రూ.1 లక్ష విలువైన పాఠ్యపుస్తకాలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) చేతులమీదుగా అందజేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఇటీవలే ఇదే కళాశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి తపన చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా తమకు ఇంకా పాఠ్యపుస్తకాలు అందలేదనే విషయాన్ని విద్యార్థులు, ప్రిన్సిపల్ ఆయన



దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల ఇబ్బందిని గమనించి వెంటనే స్పందించిన ఆయన, ఫౌండేషన్ ద్వారా పుస్తకాలను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. ఆ ఇచ్చిన మాట మేరకే బుధవారం ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తపన చౌదరి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని అన్నారు. తాను కూడా వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చానని, ఆ కష్టాలు తనకు తెలుసునని పేర్కొన్నారు. విద్యార్థులు తమ జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని చేరుకునే వరకు పట్టుదలతో కష్టపడి చదవాలి. చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకుని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలి అని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువుల ఆశీస్సులు, భగవంతుడు ప్రసాదించిన శక్తి మేరకు సమాజానికి సేవ చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. సకాలంలో స్పందించి, పాఠ్యపుస్తకాలు అందజేసిన తపన ఫౌండేషన్‌కు గారపాటి తపన చౌదరికి కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రీజియన్ ఆర్ఐఓ కె. యోహాన్, ఎస్పీడీబీటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి. రామచంద్ర కాశ్యప్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమాజ నిర్మాణమే ప్రధాని మోదీ లక్ష్యం

పేర్కిపాలెంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సత్కరించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

వీరవాసరం, సెప్టెంబర్ 30: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాలుగా నిరంతరం ప్రజా సేవకే అంకితమయ్యారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అంజిబాబు అన్నారు. ప్రజా సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా మండలంలోని పెర్కిపాలెంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సత్కరించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు విశేష సేవలందిస్తున్న టీచర్లు, ఆయాల సేవలు ఎనలేనివని అన్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.



అరసవల్లి అభివృద్ధికి రూ. 55.74 కోట్లు మంజూరు పై హర్షం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు

శ్రీకాకుళం జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబర్ 30: దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థాన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్-2.0 పథకం కింద రూ. 55.74 కోట్ల నిధులు మంజూరు చేయడంపై రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల కోసం కేంద్ర స్థాయిలో ప్రత్యేక చొరవతో కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు జిల్లా ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులతో చేసే అభివృద్ధితో జిల్లాలోని అరసవల్లి పుణ్యక్షేత్రం రానున్న రోజులలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లబోతుందన్నారు. సూర్య దేవాలయ ప్రాధాన్యతను గుర్తించి నిధులు విడుదల చేసిన విశ్వ గురు గా ఖ్యాతి పొందిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శెకావత్, రాష్ట్ర ప్రజల అలాగే ప్రాంతాలవారీగా ప్రజల మనోభావాలకు, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర మణి కిరీటంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావటంతో రానున్న రోజులలో దేశ విదేశాల నుంచి అరసవల్లి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని ఈ నిధులతో దేవాలయం మరింత అభివృద్ధి చెంది ప్రాచుర్యం పొందుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.



ACB వలలో NIMS హైదరాబాద్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ మరియు శ్రీ నోరి లక్ష్మి భాస్కర్

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (చీ×మీ) అదనపు మెడికల్ సూపరింటెండెంట్ మరియు అదనపు ప్రొఫెసర్ అయిన శ్రీ నోరి లక్ష్మి భాస్కర్‌పై, ఆదాయానికి మించిన ఆస్తుల కేసు (Cr.No.6/RCA-CIU-ACB/2026, తేదీ: 21.09.2026; సెక్షన్లు 13(1)(ఎ) మరియు 13(2) ప్రకారం) గతంలోనే నమోదైంది. గతంలో నిర్వహించిన సోదాల కొనసాగింపుగా మరియు ూ్రాజు ఢ ూాజదీ కేసుల గౌరవనీయ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా, హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లోని (5) వేర్వేరు ప్రదేశాలలో సోదాలు జరిగాయి. నిందిత అధికారితో ఆర్థిక మరియు ఇతర లావాదేవీలు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుమానిత బినామీల నివాసాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ సోదాల సమయంలో, అనుమానిత బినామీ ఆస్తులకు సంబంధించిన అనేక పత్రాలు మరియు ఇతర సాక్ష్యాధారాలను వారి నివాసాల నుండి స్వాధీనం చేసుకున్నారు. చీ×మీ ఉద్యోగి అయిన ధన్‌రాజ్ ఇంట్లో రూ. 4,94,394/-



నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే, చీ×మీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి డి. గణేష్ మరియు ఇతరుల పేర్లపై ఉన్న ఆస్తులకు సంబంధించిన పత్రాలు కూడా లభించాయి: వీటిలో మహేశ్వరంలో సుమారు రూ. 57 లక్షల విలువైన 3 వ్యవసాయ భూమి ప్లాట్లు, బంజారాహిల్స్ మీూా కాలనీలోని వెంకటేశ్వర కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రూ. 2,70,00,000/- విలువైన ఒక ఓపెన్ ప్లాట్ మరియు రూ. 20,00,000/- విలువైన రెండు పెట్టుబడులు ఉన్నాయి. వీటితో పాటు రూ. 3,00,000/- చేతి అప్పుకు సంబంధించిన రసీదులు కూడా లభించాయి. అదనపు ఆస్తుల గుర్తింపు మరియు ధృవీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసు దర్యాప్తు దశలో ఉంది. ఫోన్ నంబర్ 1064 (టోల్-ఫ్రీ నంబర్)కు కాల్ చేయండి

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

అపరేష్ కుమార్ ఎంపికయ్యే అవకాశం

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కోసం ఢిల్లీ, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పేర్లను కూడా కొలీజియం సిఫార్సు చేసింది ఒక ముఖ్యమైన పరిణామంలో, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్‌తో పాటు, గుజరాత్ మరియు ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) సూర్య కాంత్ మరియు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, బి.వి. నాగరత్న, ఎం.ఎం. సుందరేష్, పి.ఎస్. నరసింహలతో కూడిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. సిఫార్సు చేసిన పేర్లకు కేంద్రం ఆమోదం తెలిపితే, సుప్రీంకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరుతుంది



(మొత్తం మంజూరైన స్థానాల సంఖ్య 38). ప్రస్తుతం సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల, సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ చట్టం ద్వారా కోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి పెంచారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన నిర్దేశిత విధానం ప్రకారం కొలీజియం సిఫార్సుపై తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

మొయినాబాద్ మున్సిపాలిటీకి చెందిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (AO-1) మరియు సీనియర్ అసిస్టెంట్ (AO-2) ACB వలలో చిక్కారు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

30-09-2026న, మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (ూా-1) శ్రీమతి గుండు వాణి, ఫిర్యాదుదారుని నిర్మాణాన్ని అక్రమ నిర్మాణంగా పరిగణించి ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఉండేందుకు గాను, లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. ఈ ప్రక్రియలో మొయినాబాద్ గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి మరియు ప్రస్తుతం మొయినాబాద్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న యలమోని సుదర్శన్ (ూా-2) ద్వారా రూ. 75,000/- లంచం తీసుకుంటుండగా ూాజదీ సిటీ రేంజ్-2 అధికారులు ఆమెను పట్టుకున్నారు.

AO-2 వద్ద ఉన్న రూ. 75,000/- లంచం సొమ్మును అతని సమక్షంలోనే స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, నిందితులైన అధికారులు (ూా-1 ఢ ూా-2) అక్రమ లబ్ధి పొందేందుకు

తమ విధులను అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు. అందువల్ల, AO-1 మరియు ూా-2లను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ూ్రాజు ఢ ూాజదీ కేసుల గౌరవనీయ × అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

ది ప్యారడైజ్'లో ప్రియదర్శి నటనకు ప్రశంసలు

హైదరాబాద్, సెప్టెంబరు 30:'ది ప్యారడైజ్' చిత్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్రను పోలిన పాత్రలో నటించిన ప్రియదర్శిని మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందించారు. ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం జరిగే పోరాటాలు ఒక జాతి గుర్తింపునకు ఎలా స్ఫూర్తినిస్తాయో తెలంగాణ ఉద్యమం ద్వారా చూశామని పేర్కొన్నారు. అదే పోరాట స్ఫూర్తిని 'ది ప్యారడైజ్' చిత్రంలో అద్భుతంగా ఆవిష్కరించారని అన్నారు. కేసీఆర్ పాత్రలో ప్రియదర్శి పరకాయ ప్రవేశం చేసి అత్యంత సహజంగా నటించారని ప్రశంసించారు.



దసరా మహోత్సవాలకు లోకేశ్‌కు ఆహ్వానం

ఉండవల్లి, సెప్టెంబరు 30: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో అక్టోబరు 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను ఆలయ అధికారులు ఆహ్వానించారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో లోకేశ్‌ను కలిసిన దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్, బోర్డు సభ్యులు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు లోకేశ్‌కు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. దసరా మహోత్సవాలకు హాజరై అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఆలయ అధికారులు కోరారు.



సిరిసిల్ల గడీని కూల్చుతాం

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. దమ్ముంటే మీ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైటెక్ సిటీ పక్కన స్టార్ హోటళ్లు మీ పేరు మీద లేవని చెప్పగలరా? ఉన్నాయని నేను నిరూపిస్తా.. లేకుంటే పేరు మార్చుకుంటా అని రేవంత్ శపథం చేశారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో తరువాయి 2 వ పేజీలో..

ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గరుడ పక్షి దెబ్బ కాకి పిల్లకు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్‌కు ఎదురైన రాజకీయ పరాజయాన్ని ప్రస్తావిస్తూ.. అదే తరహాలో సిరిసిల్లలోనూ కాంగ్రెస్ బలం పెంచుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిరిసిల్ల అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో రూ. 1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు.

చేనేత, వృత్తినైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన సిరిసిల్ల గత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి చెందలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్లను సిరులకు నిలయంగా కాకుండా ఉరిసిల్లగా మార్చారని వ్యాఖ్యానించారు. 2009లో కేటీఆర్‌ను సిరిసిల్ల నుంచి రాజకీయాల్లోకి తీసుకువచ్చిన తీరును ప్రస్తావిస్తూ.. ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల ఆస్తులు కూడబెట్టిందని ఆరోపించారు. బతుకమ్మ చీరల వ్యవహారంలోనూ అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు.

కరీంనగర్ వేదికగా కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని రేవంత్‌రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. అమెరికా నుంచి వచ్చిన కేటీఆర్ సంపాదన, కేసీఆర్ కుటుంబ ఆస్తుల మూలాలపై ప్రశ్నలు లేవనెత్తారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి కుటుంబాలను పోషిస్తున్న తెలంగాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం మాత్రం భారీగా ఆస్తులు కూడబెట్టిందని సీఎం ఆరోపించారు. కరీంనగర్, పాలమూరు ప్రజలను తెలంగాణ ఉద్యమం పేరుతో రాజకీయంగా ఉపయోగించుకుని వదిలేశారని విమర్శించారు. ఈ వ్యాఖ్యలతో గల్ఫ్ కార్మికుల సమస్యలను కూడా రాజకీయ చర్చలోకి తీసుకొచ్చారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా సీఎం వివరించారు. విదేశాల్లో ప్రమాదవశాత్తూ మరణించే కార్మికుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంతో పాటు, వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. గత పాలనలో గల్ఫ్ వలసలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మరోవైపు సిరిసిల్ల చేనేత కార్మికులు, వృత్తిదారుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరాన్ని కూడా సభలో ప్రస్తావించారు.

రాజకీయంగా సిరిసిల్లలో కాంగ్రెస్ బలాన్ని పెంచడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సభ సాగింది. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడికి మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తానని ఆయన ప్రకటించారు. దీంతో సిరిసిల్ల నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా చూస్తే.. రేవంత్‌రెడ్డి ప్రసంగంలో కేసీఆర్ కుటుంబ ఆస్తులు, సిరిసిల్ల అభివృద్ధి, చేనేత కార్మికుల సమస్యలు, గల్ఫ్ వలసలు, బీఆర్ఎస్ పాలనపై విమర్శలు ప్రధాన అంశాలుగా నిలిచాయి.



ఏపీలో పెట్టుబడుల ప్రవాహానికి ముంబై రోడ్‌షో శ్రీకారం

నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, సెప్టెంబర్ 30 : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు వివరించేందుకు, నూతన భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా ముంబైలో బుధవారం భారీ 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షో' నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీ ణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండ పల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ రోడ్‌షోలో ప్రముఖ పారిశ్రామిక సంఘాలు, వాణిజ్య సంస్థలు, విదేశీ వాణిజ్య ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు కావలసిన భూమి, సహజ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల కు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ, పెట్టుబడులను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఈ రోడ్‌షోలో ప్రధానంగా బీఎఫ్ఎస్ఐ (BFSI) & ఫిన్‌టెక్, జౌళి–వస్త్ర రంగం, ఫార్మాస్యూటికల్స్ ఽ లైఫ్ సైన్సెస్, కెమికల్స్ & పెట్రోకెమికల్స్, పోర్టులు & షిప్పింగ్ లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఽ ఎఫ్ఎమ్‌సిజి (FMCG), గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (GCC), డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన (Renewable Energy) రంగాలలో ఉన్న విస్తృత అవకాశాలను ప్రత్యేకంగా వివరించారు. ఇక ప్రభుత్వం 3S కాన్సెప్ట్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సర్వీస్, స్టెబులిటీ) విధానంతో పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. విశాఖ సదస్సుకు సన్నాహాలు: రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర వ్యూహంలో భాగంగా ఈ రోడ్‌షో నిర్వహించినట్టు మంత్రి తెలిపారు. ఈ రోడ్ షో నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 'సీఐఐ (CII) భాగస్వామ్య సదస్సు'కు ఆరంభ వేదికగా నిలిచిందన్నారు. ఈ రోడ్‌షో ద్వారా మహారాష్ట్రకు చెందిన ప్రముఖ కంపెనీలు రాబోయే విశాఖ సదస్సులో పాల్గొని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలు మరింత విస్తృతమైనట్టు మంత్రి తెలిపారు.



ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్, 30: ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ను బుధవారం ఆకస్మికంగా సందర్శించి ప్రయాణీకులకు అందుతున్న త్రాగునీరు, టాయిలెట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణీకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణీకులతో ఆర్టీసీ సిబ్బంది ప్రవర్తన, మర్యాదగా మాట్లాడుతున్నారా లేదా, బస్సుల సమాచారం సక్రమంగా అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో ప్రధానమైన బస్టాండ్ లు ఉన్నాయని, ఆర్టీసీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ విధానం ద్వారా తెలుసుకుంటున్నదన్నారు.

ఆ ప్రజాభిప్రాయంలో జంగారెడ్డిగూడెం బస్టాండ్ లో టాయిలెట్లపై ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేసారని, వాటిని పరిశీలించేందుకు, ప్రయాణీకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీ చేశానన్నారు. బస్టాండ్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లు శుభ్రం చేయాలన్నారు. ప్రయాణీకులతో ఆర్టీసీ సిబ్బంది మర్యాదగా మాట్లాడుతూ సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా ఎంక్వయిరీ కౌంటర్, త్రాగునీటి సౌకర్యం, రిజర్వేషన్ కౌంటర్, కార్గో, పార్సిల్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. సిసి కెమెరాలు గురించి ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్గో, పార్సెల్ కేంద్రం శిధిలావస్థలో ఉండడంతో వాటి వివరాలను ఆర్టీసీ ఆర్ఎం షబ్నమ్ ను ప్రశ్నించగా, కొత్త భవనం నిర్మాణానికి 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలన్నారు.



లక్కవరంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీఎస్పీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 30, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్ లను జంగారెడ్డిగూడెం డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అయితే ప్రభుత్వం అదే హైస్కూల్లో 35 కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఈ నిఘా నేత్రాలు ఎన్నికలకు బాగా ఉపయోగపడతాయని పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూత్ ల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట లక్కవరం ఎస్సై జబ్బీర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఎస్సై వల్లి పద్మ

కామవరపుకోట, సెప్టెంబర్ 30, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తడికలపూడి ఎస్సై వల్లి పద్మ సూచించారు. బుధవారం మండలంలోని ఆడమిల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో

కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం మరియు మాండలైజ్ కంపెనీ అభ్రో సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో "యువత అభివృద్ధి కార్యక్రమం" నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తడికలపూడి ఎస్ఐ కె వల్లీ పద్మ మాట్లాడుతూ యువత రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని తెలియజేయడంతో పాటు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కామవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ సారధి ప్రసంగిస్తూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల అభివృద్ధి సెక్రెటరీ శ్రీ జి.కేశవరావు ప్రసంగిస్తూ యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం అభ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి విజయ్ ప్రసాద్ ప్రసంగిస్తూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ కలగి ఉండాలని పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ఐక్యూ ఎ సి కో ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ వై రాజేష్ తో పాటు అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్బనీ తీయనీ దెబ్బ..

విజయసాయి రెడ్డి పొలిటికల్ గేమ్ స్టార్ట్

కొత్త పార్టీ దిశగా వేగంగా పావులు

జగన్‌పై సంచలన ఆరోపణలు

మూడో ప్రత్యామ్నాయానికి పిలుపు


ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విజయసాయి రెడ్డి పేరు ఒకప్పుడు వైఎస్సార్‌సీపీకి, ముఖ్యంగా జగన్ రాజకీయ వ్యవహారాలకు విడదీయరాని అనుబంధంగా కనిపించేది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించడం నుంచి కేంద్ర ప్రభుత్వంతో సంబంధాల నిర్వహణ వరకు ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే అదే విజయసాయి రెడ్డి ఇప్పుడు మాజీ పార్టీపై తీవ్ర విమర్శలు చేయడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. బుధవారం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విశాఖను రాజధానిగా చేస్తామని చెప్పి వైసీపీ మాట తప్పిందని, మూడు రాజధానుల అంశంపై ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అమరావతిని తాను వ్యతిరేకించనని కూడా స్పష్టం చేశారు.

విజయసాయి రెడ్డి వైసీపీని ఎందుకు వీడారన్న ప్రశ్నకు గతంలోనే ఆయన సమాధానం ఇచ్చారు. 2025 జనవరిలో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన సమయంలో... ఆయన తన నిర్ణయానికి వ్యక్తిగత కారణాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం ఇచ్చిన వివరణల్లో పార్టీ నాయకత్వంతో విశ్వాసం దెబ్బతినడం, తనపై ఒత్తిడి పెరగడం వంటి అంశాలను ప్రస్తావించారు. మరోవైపు, ఆయన వైదొలగడాన్ని పార్టీ వర్గాలు భిన్నంగా విశ్లేషించాయి. అంటే విజయసాయి నిష్క్రమణకు ఒకే ఒక్క కారణం ఉందని తేల్చడం కంటే, పార్టీ అంతర్గత పరిణామాలు, నాయకత్వంతో దూరం, రాజకీయ పాత్రలో వచ్చిన మార్పులను కలిపి చూడాల్సిన పరిస్థితి ఉంది.

ఇప్పుడు విజయసాయి చేస్తున్న మరో కీలక ఆరోపణ సజ్జల రామకృష్ణారెడ్డి చుట్టూ తిరుగుతోంది. తనను జగన్ వద్ద సజ్జలే దుర్మార్గుడిగా చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జగన్ తర్వాత పార్టీ వ్యవహారాల్లో విజయసాయి కీ రోల్ ప్లే చేశారు. అలాంటి వ్యక్తి కొంతకాలానికే పార్టీకి దూరమై, ఇప్పుడు అదే నాయకత్వంపై బహిరంగంగా విమర్శలు చేయడం వెనుక ఉన్న అంతర్గత రాజకీయాలను ఈ వ్యాఖ్యలు మరోసారి చర్చలోకి తెస్తున్నాయి.

ఇదే సమయంలో విజయసాయి రాజకీయంగా మరో అడుగు ముందుకేస్తున్నారు. టీడీపీ, వైసీపీకి ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ వేదిక అవసరమని ఆయన చెబుతున్నారు. రాయలసీమ అభివృద్ధి, యువతకు అవకాశాలు, సాగునీటి ప్రాజెక్టులు వంటి అంశాలను తన ప్రతిపాదిత కొత్త రాజకీయ పార్టీ ప్రధాన అజెండాగా ఆయన చెబుతున్నారు. 40 ఏళ్లలోపు వారికి పార్టీలో 66 శాతం అవకాశాలు కల్పిస్తామని కూడా ప్రకటించారు. విజయదశమి తర్వాత కొత్త పార్టీని ప్రకటించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన ఇప్పటికే వెల్లడించారు. అంటే వైసీపీని విమర్శించడం దగ్గరే ఆగకుండా, తనకంటూ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక నిర్మించాలన్న దిశగా ఆయన అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

తాజా వ్యాఖ్యల్లో విజయసాయి మరో సున్నితమైన రాజకీయ అంశాన్ని కూడా తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలో కమ్మ, క్రిస్టియన్ వర్గాల ఆధిపత్యం ఉందని ఆయన ఆరోపిస్తూ, తమ పార్టీ అధికారంలోకి వస్తే వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే విధానాన్ని అనుసరిస్తామని చెప్పారు. అదే సమయంలో 2029 ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ మళ్లీ రాజకీయ పొత్తుల దిశగా వెళ్లే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్ కుటుంబ రాజకీయాలపైనా



ఆయన విమర్శలు చేశారు. ఇవన్నీ విజయసాయి ప్రతిపాదిత కొత్త రాజకీయ వేదికకు ఒక ప్రత్యేక రాజకీయ గుర్తింపును నిర్మించే ప్రయత్నంగా చూడవచ్చు.

మొత్తంగా చూస్తే విజయసాయి రెడ్డి కథను కేవలం వైసీపీని వీడిన నాయకుడు అనే కోణంలో చూడటం సరికాదు. జగన్‌కు అత్యంత సన్నిహితంగా పనిచేసిన నాయకుడిగా ఒక దశలో వైసీపీ రాజకీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తి.. ఇప్పుడు అదే పార్టీపై బహిరంగ విమర్శలు చేస్తూ కొత్త రాజకీయ వేదికను నిర్మించేందుకు ప్రయత్నించడం ఏపీ రాజకీయాల్లో గమనించదగ్గ పరిణామం. ఆయన చేస్తున్న ఆరోపణల్లో ఎంత రాజకీయ విభేదం ఉంది? ఎంత వ్యక్తిగత అసంతృప్తి ఉంది? ఆయన ప్రతిపాదిస్తున్న మూడో ప్రత్యామ్నాయానికి ఎంత పొలిటికల్ స్పేస్ లభిస్తుంది..? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే పరిణామాలే ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి మాత్రం విజయసాయి రెడ్డి తన రాజకీయ జీవితానికి మరో అధ్యాయం రాయడానికి సిద్ధమవుతున్నారు. చూడాలి మరి రానున్న రోజుల్లో వీఎస్సార్ పొలిటికల్ గేమ్ ఎలా ఉంటుందో.

జనసేనలో కొత్త కమిటీలు

స్థానిక సమరానికి జనసేన సరికొత్త వ్యూహం

పాత కమిటీలకు పవన్ గుడ్‌బై

జనసేన

స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధమవుతోంది. ఎన్నికల సమన్వయం, పర్యవేక్షణను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. స్థానిక ఎన్నికల కోసం పార్టీ ఇప్పటికే ప్రత్యేక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో, పార్లమెంట్ స్థాయిలో బాధ్యతలను తిరిగి కేటాయించడం తాజా నిర్ణయంలో ప్రధాన అంశంగా నిలిచింది.

ఇందులో భాగంగా గతంలో నియమించిన పార్లమెంట్ సమన్వయకర్తలు, ముగ్గురు సభ్యులతో కూడిన సమన్వయ కమిటీలు, వాటికి అనుబంధంగా పనిచేసిన సపోర్ట్ టీమ్‌లను రద్దు చేస్తున్నట్లు జనసేన స్పష్టం చేసింది. అదే విధంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 25 మంది సభ్యులతో కూడిన పార్లమెంట్ కమిటీలను కూడా తక్షణమే రద్దు చేసినట్లు తెలిపింది. అంటే ఎన్నికల వేళ ఇప్పటికే ఉన్న నిర్మాణాన్ని కొనసాగించడం కంటే.. కొత్త అవసరాలకు అనుగుణంగా పార్లమెంట్ నియోజకవర్గాల స్థాయిలో టీమ్‌లను ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది.

అయితే రాష్ట్ర స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయం కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల ప్రత్యేక కమిటీతో పాటు ప్రధాన సమన్వయ కమిటీలు మాత్రం యథావిధిగా కొనసాగనున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీకి క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించడం, దాన్ని పరిశీలించి పార్టీ అధ్యక్షుడికి నివేదించడం వంటి బాధ్యతలు అప్పగించారు. ఈ కమిటీలో చిల్లపల్లి శ్రీనివాసరావు, పెండెం దొరబాబు, వంశీకృష్ణ యాదవ్, పులవర్తి ప్రశాంత్, యనమల భాస్కర్ ఉన్నారు. ఇప్పటికే ఉన్న 14 మంది సభ్యుల కమిటీతో ఈ కొత్త కమిటీ సమన్వయం చేసుకుంటూ పనిచేయనుంది.

మొత్తంగా చూస్తే.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జనసేన తన ఎన్నికల యంత్రాంగాన్ని క్షేత్రస్థాయికి మరింత అనుసంధానం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పాత కమిటీలను రద్దు చేసి కొత్త పార్లమెంట్ స్థాయి టీమ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా సమాచారం సేకరణ, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సమన్వయం, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం వంటి అంశాలను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలన్నది తాజా పునర్వ్యవస్థీకరణలో ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. అయితే ఈ కొత్త కమిటీలు ఎంత వేగంగా ఏర్పడతాయి, వాటి బాధ్యతలు ఏమిటి, కూటమి భాగస్వాములతో సమన్వయం ఎలా ఉంటుంది అన్నది రాబోయే రోజుల్లో స్పష్టత రానుంది.

రాజకీయాల్లోకి వస్తున్నా..

మాజీ ఐఏఎస్ దివ్యా మిట్టల్ ఎంట్రీ

13 ఏళ్ల ఐఏఎస్ సర్వీస్‌కు గుడ్‌బై

బ్యూరోక్రసీ నుంచి పాలిటిక్స్ వైపు

యూపీ ఎన్నికల వేళ రాజకీయ అరంగేట్రం

13 ఏళ్ల సుదీర్ఘ సివిల్ సర్వీస్‌కు గుడ్‌బై చెప్పిన మాజీ ఐఏఎస్ అధికారిణి దివ్యా మిట్టల్ ఇప్పుడు రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. అయితే తాను ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదని స్పష్టం చేస్తూ.. ప్రజలతో కలిసి స్వతంత్ర వేదికను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఉత్తర్‌ప్రదేశ్‌నే తన కర్మభూమిగా పేర్కొన్న ఆమె.. ప్రభుత్వ కార్యాలయాలకు సామాన్యుల సమస్యలు చేరుతున్నా, వాటికి పరిష్కారం దొరకని పరిస్థితులు ఉన్నాయని తన అనుభవాలను ప్రస్తావించారు. గ్రామీణ మౌలిక వసతులు, విద్య, ఉద్యోగాలు, పరీక్షల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలను రాజకీయ కార్యాచరణలో ప్రధానంగా తీసుకుంటానని ఆమె వెల్లడించారు.



దివ్యా మిట్టల్ రాజకీయ ప్రవేశం వెనుక ఆమె పరిపాలనా అనుభవమే ప్రధాన నేపథ్యంగా కనిపిస్తోంది. ఐఐటీ ఢిల్లీ, ఐఐఎం బెంగళూరులో విద్యాభ్యాసం చేసిన ఆమె.. లండన్‌లో పనిచేసిన అనంతరం సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చారు. 2013 బ్యాచ్ యూపీ కేడర్ అధికారిణిగా పనిచేసిన ఆమె సంత్ కబీర్ నగర్, మిర్జాపూర్, దేవరియా జిల్లాలకు జిల్లా కలెక్టర్‌గా సేవలందించారు. మిర్జాపూర్‌లో మారుమూల గ్రామానికి పైపుల ద్వారా తాగునీరు అందించే కార్యక్రమం వంటి పనులతో ఆమెకు గుర్తింపు వచ్చింది. ఆగస్టు 30న ఐఏఎస్‌కు రాజీనామా చేయగా, సెప్టెంబర్‌లో ఆ రాజీనామా ఆమోదమైంది. అయితే దివ్యా మిట్టల్ రాజకీయ ప్రయాణం ఎలా రూపుదిద్దుకుంటుందన్నదే ఇప్పుడు ఆసక్తికర అంశం. ఇప్పటికే పార్టీ రాజకీయాలకు దూరంగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. దీంతో స్వతంత్ర వేదికను ఎంతమేరకు నిర్మించగలరు, ప్రజా మద్దతును ఎలా కూడగడతారు, ఎన్నికల రాజకీయాల్లోకి ప్రత్యక్షంగా వస్తారా అన్న ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. ముఖ్యంగా 2027 ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఆమె రాజకీయ ప్రవేశం చేయడం ఈ పరిణామానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ప్రస్తుతానికి ఆమె ఎలాంటి పార్టీతో పొత్తు లేదా అనుబంధం ప్రకటించలేదు. అందువల్ల దివ్యా మిట్టల్ రాజకీయ ప్రస్థానం రాబోయే రోజుల్లో ఏ రూపం దాల్చుతుందన్నది ఆమె నిర్మించబోయే వేదిక, ప్రజా స్పందన, తదుపరి రాజకీయ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.



తెలంగాణ కేబినెట్ భేటీ

నేడు తెలంగాణ మంత్రివర్గ సమావేశం

పలు కీలక అంశాలపై చర్చ

ఉద్యోగులకు డీఏపై కీలక నిర్ణయం

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇవాళ తెలంగాణ మంత్రి వర్గం సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రెండు పెండింగ్ డీఏల విడుదలపై కీలక నిర్ణయం తీసుకునే చాన్స్ ఉంది. దసరా నాటికి రెండు డీఏలు ఇవ్వాలన్న ఉద్యోగ సంఘాల డిమాండ్‌పై ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చింది. పెండింగ్ ఉద్యోగ, పెన్షన్ బకాయిలు, పీఆర్సీ అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది.

రెవెన్యూ వ్యవహారాలు కూడా ఈసారి క్యాబినెట్ అజెండాలో ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ధరణి, 22-ఏ నిషేధిత భూముల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. 22-ఏ అంశంపై శాశ్వత పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన భూముల వ్యవహారాలపై విచారణకు ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో భూ వ్యవహారాలపై క్యాబినెట్‌లో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కేసీఆర్ కుటుంబ భూముల అంశం రాజకీయంగా కూడా హాట్‌టాపిక్‌గా మారింది. సెప్టెంబర్ 16న అసెంబ్లీలో 22-ఏ భూములపై చర్చ సందర్భంగా రేవంత్‌రెడ్డి కేసీఆర్ కుటుంబ భూములపై విచారణకు ఆదేశించగా, బీఆర్ఎస్ వైపు నుంచి కూడా ముఖ్యమంత్రి కుటుంబ ఆస్తులపై న్యాయ విచారణకు డిమాండ్ వచ్చింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే విచారణ చేపట్టింది. కావున ఈ అంశంపై క్యాబినెట్ సమావేశంలో ఏదైనా పరిపాలనా నిర్ణయం లేదా తదుపరి చర్యలపై చర్చ జరుగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు క్యాబినెట్ అజెండాలో మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, మూసీ ప్రాజెక్టు, గ్లోబల్ సమ్మిట్ సన్నాహాలు, సంక్షేమ పథకాలు వంటి అంశాలు కూడా ఉండే అవకాశం ఉంది.

కార్యకర్తల సంక్షేమానికి జగనన్న పెద్ద పీట

వైసీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి కనకరాజు



కామవరపుకోట : వైఎస్సార్‌సీపీలో కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధినేత వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ పెద్ద పీట వేస్తారని పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి, కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షులు సాయిన కనకరాజు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, వివిధ కమిటీల్లో పనిచేస్తూ అకాల మరణం చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ అధినేత రు. 5 లక్షల ఆర్థికసాయం ప్రకటించడం ప్రశంసనీయం అని కనకరాజు పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు అని.. పార్టీ జెండాను భుజాన ఎత్తుకుని పనిచేసే ప్రతి నాయకుడిని, కార్యకర్తను తన సొంత కుటుంబ సభ్యుడిగా భావించే నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి పార్టీ సభ్యత్వం ఉండి ఏ కారణంతో అయినా మరణించిన పార్టీ నేతల కుటుంబాలకు రు. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్న పార్టీ అధినేత నిర్ణయం వారి కుటుంబాల్లో కొండంత ధైర్యాన్ని నింపుతుందన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతి కార్యకర్త వెంటా తాను ఉంటానని జగనన్న మరోసారి నిరూపించారని కనకరాజు అన్నారు.

ముడి పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి


ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్..

ఏలూరు సెప్టెంబర్ 30 : కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతిపై ఉన్న సుంకాన్ని 16.5 శాతం నుండి 11 శాతానికి తగ్గించడం దేశ, రాష్ట్ర ఆయిల్ పామ్ రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపుపై వారుమాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న 27 శాతం దిగుమతి సుంకాన్ని 16.5 శాతానికి తగ్గించిందన్నారు .ఇపుడు మళ్లీ 11 శాతానికి తగ్గించారని చెప్పారు. దేశీయ వంటనూనెల ఉత్పత్తిని అస్థిరపరిచి, వంటనూనెల విషయంలో దేశం స్వయం సమృద్ధి సాధించే లక్ష్యానికి విఘాతం కలిగించే తిరోగమన నిర్ణయం అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో వేరుశెనగ, నువ్వులు,ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పత్తి దిగుమతి పై ఉన్న 30 శాతం దిగుమతి సుంకాన్ని 11 శాతానికి ఇపుడు సున్నాకు తగ్గించారని చెప్పారు. ఫలితంగా లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న పత్తి రైతులకు మద్దతు ధరలు లభించలేదన్నారు.ఇపుడు నూనె గింజలు పండించే ఆయిల్ పామ్, వేరుశనగ, నువ్వులు తదితర పంటల రైతులు దివాళా తీస్తారని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయని



ఆవేదన వ్యక్తం చేశారు.ముడి పామాయిల్ పై కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.25 వేలు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఊర్వశి వర్సెస్ ఏఐ కంపెనీ.. రూ.7 వేల కోట్ల వివాదం

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా, లాస్ ఏంజెల్స్‌కు చెందిన ఓ కృత్రిమ మేధ సంస్థ మధ్య వివాదం ముదురుతోంది. తన పేరు, ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించారంటూ ఊర్వశి బృందం ఆరోపించింది. ఈ వ్యవహారంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని, నష్టపరిహారం సుమారు రూ.7,000 కోట్లుగా అంచనా వేస్తున్నామని ఆమె బృందం వెల్లడించింది. అనుమతి లేకుండా వాడొద్దంటూ..

ఊర్వశి పేరును తమ వ్యాపారంలో అనుమతి లేకుండా ఉపయోగించవద్దని ఆమె బృందం ఏఐ సంస్థను హెచ్చరించింది. అయితే ఇది ఊర్వశి బృందం చేసిన ఆరోపణ, నష్టపరిహారానికి సంబంధించిన డిమాండ్ మాత్రమేనని.. తుది న్యాయపరమైన నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఈ ప్రకటనపై బాలీవుడ్.ఏఐ, హాలీవుడ్.ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ షీరాజ్ హసన్ స్పందించారు.

'ఆ మాటలు మేం చెప్పించలేదు'

ఈ వివాదానికి ముందు ఊర్వశి, షీరాజ్ హసన్ నిర్వహించిన ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో బాలీవుడ్, కృత్రిమ మేధ గురించి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. ఆ వీడియో వైరల్ కావడంతో తాజాగా షీరాజ్ హసన్ స్పందిస్తూ.. ఆ వ్యాఖ్యలను తాము ఆమెతో బలవంతంగా చెప్పించలేదని పేర్కొన్నారు. కృత్రిమ మేధ, భవిష్యత్ వినోద పరిశ్రమపై మరింత అవగాహన పెంచుకున్న తర్వాత మాట్లాడాలని సూచించారు.

వినోద రంగ భవిష్యత్తుపై భిన్న వాదనలు

కృత్రిమ మేధ ఆధారిత సినిమాలు, డిజిటల్ పాత్రలు, బహుభాషా వర్చువల్ నటులు వినోద రంగ భవిష్యత్తులో కీలకంగా మారతారని షీరాజ్ హసన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు సెలబ్రిటీల పేరు, ముఖచిత్రం, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించడంపై హక్కుల పరిరక్షణకు సంబంధించిన చర్చలు కూడా కొనసాగుతున్నాయి.




ఉజ్వల్ నికమ్‌గా రాజ్‌కుమార్ రావు.. ట్రైలర్ విడుదల

బాలీవుడ్ ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్'. ముంబై 26/11 ఉగ్రదాడుల నేపథ్యం లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ జీవితంలోని కీలక ఘట్టాల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. 26/11 ముంబై ఉగ్రదాడుల సమయంలో ఉజ్వల్ నికమ్ చేపట్టిన న్యాయపోరాటం, అజ్మల్ కసబ్ కేసులో ఆయన చేసిన వాదనలు, కోర్టు గదిలో చోటుచేసుకున్న కీలక పరిణామా లను ఈ చిత్రంలో చూపించనున్నారు. వీటితో పాటు నికమ్ వ్యక్తిగత జీవితంలోని ముఖ్యమైన అంశాలను కూడా కథలో భాగంగా తెరకె క్కించినట్లు తెలుస్తోంది. ఉగ్రదాడుల వెనుక ఉన్న పరిణామాలు, అనంతరం జరిగిన న్యాయ పోరాటాన్ని ట్రైలర్ ద్వారా ఆసక్తికరంగా చూపించారు. ఈ బయోపిక్‌లో ఉజ్వల్ నికమ్ పాత్రను రాజ్‌కుమార్ రావు పోషిస్తున్నారు. ఆయన సరసన వామికా గబ్బి ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. జైదీప్ అహ్లావత్, సికందర్ ఖేర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



ఓటీటీలోకి 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'..

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్' సినిమా థియేటర్లలో విడుదలైన విషయం తెలిసిందే. ఆదిత్య హసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబరు 9 నుంచి డిజిటల్ వేదికపై స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో స్పందన అందుకోలేకపోయిన సినిమాలకు ఓటీటీ మంచి వేదికగా మారుతోంది. ఈ నేపథ్యంలో 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్' కూడా డిజిటల్ విడుదలతో మరింత మంది ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది. ఓటీటీ స్ట్రీమింగ్ సమయంలో ఈ సినిమాను ఇతర భాషల్లోనూ అందుబాటులోకి తీసుకురావచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే ఏయే భాషల్లో సినిమా విడుదల కానుందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించగా.. శివాజీ, వాసుకి, శ్రీనివాస్ గవిరెడ్డి, కల్యాణ్ శంకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రానికి సాయి సౌజన్య సహ నిర్మాతగా వ్యవహరించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు.



'ధర్మన్'లో శ్రీలీల..

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ధర్మన్' సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికర విషయం వెలుగులోకి వస్తోం ది. ఇప్పటికే ఈ చిత్రంలో రామ్ పోతినేని నటిస్తున్నట్లు హీరోయిన్ రాశీ ఖన్నా అనుకో కుండా వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజా గా ఈ సినిమాలో శ్రీలీల కూడా భాగమైనట్లు ఓ వీడియో ద్వారా స్పష్టమైనట్లు తెలుస్తోంది. షూటింగ్ జరుగుతున్న ప్రాంతం నుంచి బయ టకు వచ్చిన వీడియోలో శ్రీలీల సంప్రదాయ దుస్తుల్లో కనిపించడంతో ఆమె నటిస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. శ్రీలీల పాత్రపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరాలను వెల్లడించలేదు. ఆమె ఎలాంటి పాత్రలో కనిపిస్తారు? రజనీ కాంత్ పాత్రతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉంటుంది? కథలో ఆమె పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? అనే విషయాలు ప్రస్తు తానికి సస్పెన్స్‌లోనే ఉన్నాయి.



తారక్‌ను 'జెన్‌జీ ఎన్టీఆర్' అన్న రాఘవేంద్రరావు

ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. అక్టోబరు 2న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తారక్ రాకతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. అయితే దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు చేసిన సరదా వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేదికపైకి వచ్చిన కె. రాఘవేంద్రరావు తన ప్రసంగాన్ని 'జై ఎన్టీఆర్' అంటూ ప్రారంభించడంతో అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. అయితే వెంటనే ఆయన తన మాటలకు సరదా జోడించారు. తాను చెప్పిన 'జై ఎన్టీఆర్' అక్కడ కూర్చున్న జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశించి కాదని, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావులను ఉద్దేశించిందేనని చెప్పడంతో సభలో నవ్వులు పూశాయి. అనంతరం నందమూరి కుటుంబంలోని తరాలను ప్రస్తావిస్తూ రాఘవేంద్రరావు తనదైన శైలిలో చమత్కరించారు. నందమూరి తారక రామారావు తర్వాత ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ, ఆ తర్వాత ఆయన కుమారుడు జూనియర్ ఎన్టీఆర్ అంటూ వివరించారు. చివరగా తారక్‌ను 'జెన్‌జీ ఎన్టీఆర్' అంటూ సరదాగా సంబోధించడంతో అభిమానులు మరోసారి నవ్వులతో సందడి చేశారు. దర్శకేంద్రుడి మాటలు వింటూ జూనియర్ ఎన్టీఆర్ చిరునవ్వులు చిందించారు. పక్కనే ఉన్న ఎస్.ఎస్. రాజమౌళి కూడా నవ్వుతూ కనిపించారు. రాఘవేంద్రరావుకు, నందమూరి కుటుంబానికి ఉన్న అనుబంధం నేపథ్యంలో సాగిన ఈ సరదా సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తారక్ ఇచ్చిన స్పందనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

Apublished by **KALIDINDI SUMALATHA**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by **RAGHURAMA RAJU KALIDINDI** and printed by **KALIDINDI SUMALATHA** at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467